క్లుప్తంగా

నులకపేట, బ్రహ్మానందపురం రోడ్డు విస్తరణ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి నుంచి బైపాస్‌రోడ్డుకు నులకపేట నుంచి బ్రహ్మానందపురం మీదుగా వెళ్లే రహదారిలో రైలుగేటు మధ్య సోమవారం నుంచి కార్పొరేషన్ అధికారులు విస్తరణ పనులు చేపట్టారు. వడ్డేశ్వరం అండర్‌పాస్ నుంచి బ్రహ్మానందపురం వరకు రూ.కోటితో ఫారెస్ట్‌లో బీటీ రోడ్డు ఏర్పాటు చేయడంతో ఈ రహదారిలో ట్రాఫిక్ పెరిగింది. రెండు రైల్వేగేట్ల మధ్య విస్తరణ తక్కువగా ఉండడంతో సుమారు 800 మీటర్ల పొడవున కార్పొరేషన్ అధికారులు విస్తరణ పనులు చేపట్టారు. రెండు మూడు రోజుల్లో ఈ పనులు పూర్తికానున్నట్లు బ్రహ్మానందపురం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎబినైజర్ తెలిపారు.

13న లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ రెండో వార్షికోత్సవం ఈనెల 13న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మానుకొండ వెంకట సుబ్బారెడ్డి, వెంకటరమణ సోమవారం తెలిపారు. స్వామికి ఉదయం వైఖానస ఆగమం ప్రకారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు, సుదర్శన హోమం, స్వామి శాంతి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు.

టీటీడీ ఆలయంలో మాణిక్యవరప్రసాద్ పూజలు



వెంకటపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయాన్ని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, జిల్లా పార్టీ అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ సోమవారం సందర్శించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. రాజధాని ప్రాంత అసైన్డ్ రైతు సంఘం నాయకులు ఎమ్మెల్సీ డొక్కాను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు కౌలు పరిహారం జమయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన డొక్కా సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మంగళగిరి: నగరంలోని మన్నెంవారి వీధిలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోలో బియ్యం తరలిస్తున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

పవర్ లిఫ్టర్లకు ఎమ్మెల్యే అభినందన

మంగళగిరి: జగ్గయ్యపేటలో ఈనెల 2, 3 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అభినందించారు. సోమవారం నగరంలోని చింతక్రింది కనకయ్య ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆర్కేను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు, కోచ్ ఎస్కే సంధానీలతోపాటు పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు జాబ్‌మేళా

కాకుమాను: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ కల్పన, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో పని చేయుటకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాబ్స్ రీసోర్స్ పర్సన్ వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని సీడాప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7286962778 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజల చింత తీరేలా..

- తాగునీటి కష్టాలకు చెక్
- కృష్ణాజలాల సరఫరాకు ట్రిల్ రన్
- రెండు ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌బెడ్‌ల పనులు పూర్తి
- మరో రెంటి పనులు 80 శాతం పూర్తి
- ఎమ్మెల్యే ఆర్కే కృషితో సాఫల్యం
- ఉండవల్లి ప్రాంత వాసుల ఆనందం

తాడేపల్లి రూరల్ : కృష్ణానది ఒడ్డున ఉండి కృష్ణా జలాలను తాగే భాగ్యం లేక ఇన్నాళ్లూ అవస్థలు పడిన ఉండవల్లి ప్రజల ఆశ ఎట్టకేలకు తీరనుంది. తమకు కృష్ణా జలాలు అందించాలని ఎన్నోఏళ్లుగా ఎంతోమంది ప్రజాప్రతినిధులకు దరఖాస్తులు చేసుకున్నా నెరవేరని వారి కల ఇన్నాళ్లకు సాకారం కాబోతోంది. మంగళగిరి శాసన సభ్యులుగా ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండోసారి ఎన్నికైన తరువాత 3 నెలల క్రితం ఉండవల్లిలో పర్యటించారు. ఆ సందర్భంలో స్థానిక ప్రజలు తాగునీరు సరిగా సరఫరా కావడం లేదని చెప్పడంతో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల చేత సర్వే చేయించి, ఉండవల్లి ప్రజానీకానికి కృష్ణాజలాలను అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూడు నెలల కాలంలో ఈ పనులను పూర్తిచేసి కృష్ణాజలాలను అందించాలని అధికారులకు సూచించారు. రూ.కోటి వ్యయంతో ఉన్న పాత పైప్‌లైన్లు ఉపయోగించుకుని తొమ్మిది ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌బెడ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఉండవల్లి సెంటర్ అమరావతి రోడ్డులో ఏర్పాటు చేసిన రెండు ప్రెజర్ శాండ్ ఫిల్టర్ బెడ్ల పనులు సోమవారానికి పూర్తయ్యాయి. కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది ట్రిల్‌రన్ కూడా నిర్వహించి ఉండవల్లి సెంటర్‌లో 90 వేల లీటర్లు ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో కృష్ణా జలాలను నింపారు. 45 నిమిషాల్లో వాటర్ ట్యాంక్ నిండింది. దీంతోపాటు డైరెక్ట్‌గా పంపింగ్ కార్యక్రమం చేపట్టి విజయవంతం చేశారు. ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు తాగునీటిని సరఫరా చేయవచ్చని ఇంజినీరింగ్ సిబ్బంది తెలియజేస్తున్నారు. దీంతో ఉండవల్లి ప్రాంతంలో తాగునీటి కష్టాలు తీరినట్లేనని ఉండవల్లి ప్రజానీకానికి స్వచ్ఛమైన కృష్ణాజలాలను అందజేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఉండవల్లి హరిజనవాడకు వెళ్లే దారిలో గుంటూరు చానల్ వద్ద నిర్మిస్తున్న మరో రెండు ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌బెడ్ల పనులు 80 శాతం పూర్తయ్యాయని, మరో ఐదు రోజుల్లో అక్కడ కూడా పనులు పూర్తిచేసి ఉండవల్లి హరిజనవాడకు కృష్ణాజలాలను అందించనున్నట్లు తెలిపారు. మరో ఐదు ప్రెజర్ శాండ్ ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఉండవల్లిలో ప్రస్తుతం జనాభా 15,700 మంది ఉండగా వారికి అవసరమైన 21,19,500 లీటర్ల నీటిని ఉదయం, సాయంత్రం అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.



ఉండవల్లి అమరావతి రోడ్‌లో ఏర్పాటు చేసిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్ బెడ్‌లు



వాటర్ ట్యాంకర్‌లో ఫిల్లింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన పైపులైన్

ఇతర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ఏర్పాట్లు

కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగితే కృష్ణాజలాలను అందించేందుకు ఉండవల్లిలో కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక పైప్‌లైన్ ఏర్పాటు చేసి ట్యాంకర్లలో ఫిల్లింగ్ చేసేలా చర్యలు చేపట్టారు. ఒక ట్యాంకర్ 5–7 నిమిషాల్లో ఫిల్లింగ్ చేసుకోవచ్చని ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

చాలా ఆనందంగా ఉంది



ఉండవల్లిలో కార్పొరేషన్ అధికారులు బోరు వాటర్ అందించేవారు. సరిగా నీళ్ల రాక కలుషితమైన నీరు రావడంతో చాలా ఇబ్బందులకు గురయ్యాం. ఎమ్మెల్యే ఆర్కే చొరవతో మా ప్రాంతంలో కృష్ణా జలాలు అందిస్తున్నారు. గతంలో ఒకపూట వస్తే మరోపూట నీళ్ల వచ్చేవి కాదు. ఇప్పుడు రెండుపూట్లా నీళ్ల అందించేందుకు పనులు చేపట్టడం చాలా ఆనందించదగ్గ విషయం.

– కొప్పుల కమల, ఉండవల్లి హరిజనవాడ

ఎమ్మెల్యే వల్లే సాకారం



మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి చెప్పారంటే చేస్తారు. ఉండవల్లి, పోలకంపాడుకు తాగునీరు సరఫరా అవడం లేదు. తాడేపల్లి ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి తాగునీరు అందించండి అని ఆయనకు విన్నవించుకున్నాం. కొత్తపైపులైన్లు వేసి కృష్ణా జలాలు అందిస్తానని మూడు నెలల క్రితం ఆయన మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం కృష్ణాజలాలను మా ప్రాంతానికి అందించారు.

– బత్తుల దాను, పోలకంపాడు

అందరికీ కృష్ణా జలాలు

ఎమ్మెల్యే ఆర్కే

ఉండవల్లి ప్రాంతంలో అందరికీ కృష్ణా జలాలను అందించేలా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం రాత్రి ఉండవల్లి అమరావతి రోడ్డులోని గుంటూరు చానల్ ఒడ్డున ఏర్పాటు చేసిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌బెడ్ ప్లాంట్‌ను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఉండవల్లిలో ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందేలా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అమరావతి రోడ్డులో ఏర్పాటు చేసే ఫిల్టర్ బెడ్ నుంచి ఉండవల్లిలో, ఉండవల్లి సెంటర్‌లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీరు సరఫరా చేయాలని, అమరావతి రోడ్డులో ఉన్న ప్రతి రహదారిలో కొత్తగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వారికి వెంటనే కృష్ణాజలాలను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వినియోగంలోకి వచ్చిన ప్రెజర్ శాండ్ ట్యాంక్ నుంచి చివరి ఇంటివరకు తాగునీరు సరఫరా అవుతుందా లేదా అనే విషయాన్ని మంగళవారం ఉదయం 7 గంటలకు కార్పొరేషన్ అధికారులు వచ్చి పరిశీలించాలని చెప్పారు. ఉండవల్లిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, సెక్రటరీ రాధాకుమారి, మంగళగిరి శివాలయం ట్రస్ట్‌బోర్డు మెంబర్ కొల్లి మునలారెడ్డి, కళ్ళం సాంబిరెడ్డి, బుర్రముక్కు భాస్కరరెడ్డి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద సుమారు రూ.2.39 కోట్లతో చేపట్టిన చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాలను సోమవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలిసి పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

- తొలుత నగరంలోని చింతక్రింది కనకయ్య బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలిసి పరిశీలించారు. పాఠశాలలోని ప్రతి తరగతి గదిని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే కమిటీ సభ్యులతో పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. పాఠశాల 79వ వార్షికోత్సవంలోనూ ఎమ్మెల్సీ మురుగుడు హనుంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలిసి ఎమ్మెల్యే ఆర్కే పాల్గొన్నారు. 79ఏళ్ల క్రితమే విద్య ప్రాముఖ్యాన్ని గుర్తించి పాఠశాలను స్థాపించిన చింతక్రింది కనకయ్య సేవలను ప్రశంసించారు. పాఠశాలలో విద్యాప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల నియామకానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు.
- పాత బస్టాండ్ ఆవరణలోని ప్రగడ కోటయ్య చేనేత ప్రాంగణం వద్ద నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ చేనేత భవన్ నిర్మాణ పనులనూ ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పరిశీలించారు. చేనేత భవన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు.
- ప్రభుత్వం మంగళగిరికి జిల్లా అదనపు కోర్టును మంజూరు చేయడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంగళగిరి మార్కెట్ యార్డులో జరిగిన పాలకవర్గ సాధారణ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఆర్కేను సమావేశం అనంతరం న్యాయవాదులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు సింగంశెట్టి రామచంద్రరావు, గుజ్జర్లపూడి జాన్‌బాబు, న్యాయవాదులు లెనిన్ బాబు, రేటూరి కిషోర్, రంగిశెట్టి లక్ష్మి, కోసూరి చంద్రశేఖర్, బొర్రా మధు, కొడాలి శేఖర్, బుల్లా విజయ రాఘవ, కంచర్ల ప్రకాశరావు తదితరులు ఎమ్మెల్యే ఆర్కేను కలసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఉన్నారు.



రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మిస్తున్న మగ్గాల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి

అన్నదాతలకు మార్కెట్ యార్డు పాలకవర్గ సభ్యులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చెప్పారు. సోమవారం నగరంలోని మార్కెట్ యార్డు సమావేశ మందిరంలో వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యులకు సూచనలు చేశారు. మార్కెట్ యార్డు అభ్యున్నతికి కృషి చేయాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆదాయ మార్గాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.సీతారామయ్య, ఉద్యానశాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజరాణి, యార్డు డైరెక్టర్లు బాపనపల్లి అన్నపూర్ణ, పాటిబండ్ల కుమారి, ఆలూరి రాజ్యం, మాణిక్యాల శ్రీలక్ష్మి, బోనం శివకుమారి, బుర్రముక్కు భారతీదేవి, దాసరి ఇస్సాకమ్మ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది యూనిఫాం ధరించాలి

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



మంగళగిరి: సచివాలయ సిబ్బంది విధిగా యూనిఫాం ధరించాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని చెప్పారు. సోమవారం ఆమె బ్యాంకు కాలనీలోని 19వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. సచివాలయ సెక్రటరీలు వలంటీర్లతో కలిసి వార్డుల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

పాఠశాల తనిఖీ



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, పెనుమూలి, చిలువూరులోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం సోమవారం తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్య ప్రణాళికలను రూపొందించుకుని బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.డి.గయాజుద్దౌలా, షేక్ బాబ్జీ, రిజ్వానా బేగం, రుక్సానా, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అధికారులతో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు సమీక్ష

మంగళగిరి: నగరంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సూచించారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగరపాలక సంస్థ, దేవదాయ, పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రగడ కోటయ్య ప్రాంగణంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ పేరుతో సుమారు రూ.4 కోట్లతో చేనేత భవన్ నిర్మాణం చేపట్టామని, రాజీవ్ గృహకల్పలో సుమారు రూ.2.39 కోట్లతో చేనేత మగ్గాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తెనాలి రోడ్డు రక్షిత మంచినీటి పథకం వద్ద రూ.1.50 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు, రూ.కోటి రూపాయలతో చేపట్టిన స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. నగరంలోని పెద్ద కోనేరును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయడంతోపాటు కొండపై వేంచేసి ఉన్న గండాలయస్వామి గుడి వద్ద దాతల సహకారంతో సుమారు రూ.2 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టామని, పనులన్నింటినీ వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అదే విధంగా నగరంలో రూ.50 లక్షలతో ఆయా కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి, నగర కమిషనర్ శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, నృసింహుని దేవస్థాన ఈవో ఎ.రామకోటిరెడ్డిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అలరించిన 'పేగు రాసిన శాసనం'

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి శ్రీ శక్తేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని వేదికపై సోమవారం రాత్రి ప్రదర్శించిన పేగు రాసిన శాసనం నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నూతక్కి కళాకారులు జొన్నల సుబ్బారెడ్డి, అన్నపురెడ్డి శివరామరెడ్డిని స్మరించుకుంటూ స్థానిక గురజాడ కళావేదిక ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు గోపి దర్శకత్వంలో డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు రచించిన పేగురాసిన శాసనం నాటికను రసరమ్యంగా ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తిలకించారు.



పేగురాసిన శాసనం నాటికలోని ఓ దృశ్యం

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న పార్టీలో చేరిన కార్యకర్తలు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చెప్పారు. నగర పరిధిలోని బేతపూడికి చెందిన 40 తెలుగుదేశం కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న నేపథ్యంలో పార్టీపై ఆకర్షితులై తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరడం అభినందనీయమని, భవిష్యత్తులో పార్టీలో చేరిన వారందరికీ తామంతా అండగా ఉంటామని పేర్కొన్నారు. బేతపూడిలో పలు అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉందని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు సంకా బాలాజీ గుప్తా, వాసా పోలు రాజు, బేతపూడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం అందించడానికి కృషి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్

గుంటూరు లీగల్: సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సహాయం అందించి వారికి అండగా నిలిచేందుకు న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు కృషి చేస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సోమవారం ఇంటర్నేషనల్ జస్టిస్ ఇండియా వారితో కలిసి మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధంపై ఒకరోజు వర్క్ షాప్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. కె.రత్నకుమార్ మాట్లాడుతూ వన్ స్టాప్ క్రైసిస్ బృందాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ తరఫున విలియమ్ క్రిస్టఫర్ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రేస్ క్రిస్టెఫర్, ఐజేఎం సభ్యులు, పలువురు న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్

మండల లీగల్ సెల్ కమిటీ నియామకం

మంగళగిరి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఐదుగురు న్యాయవాదులతో కూడిన మండల లీగల్ సెల్ కమిటీని నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులను జారీ చేశారు. న్యాయవాదులు దొడ్డక శ్రీనివాసరావు, జొన్నాదుల లెనిన్‌బాబు, టి.రాజ్యలక్ష్మి, ఎన్.రజిని, లంకపల్లి పెద్ద బుజ్జి మండల లీగల్ సెల్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ కమిటీ పేదలకు ఉచిత న్యాయ సలహాలు, సేవలు అందిస్తుంది.

9,10 తేదీలలో చెస్ పోటీలు

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9,10వ తేదీలలో నాగార్జున యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి సోమవారం తెలిపారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.జాన్సన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన డిగ్రీ కళాశాలల నుంచి 100కు పైగా జట్లు పాల్గొంటాయని తెలిపారు. యూనివర్సిటీ చెస్ టీంను కూడా ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థుల ర్యాలీ

కళాశాల ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఆదేశాల ప్రకారం చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అక్కడ ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సులు, సదుపాయలు, ల్యాబ్స్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల గురించి వివరించి సీనియర్ ఇంటర్ విద్యార్థులు స్థానిక డిగ్రీ కళాశాలలో చేరాలని సూచించారు.